సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



రిమ్స్‌లో కార్పొరేట్ వైద్యం
కడప ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్యసేవలు విస్తృతమయ్యాయి. ఇక్కడికి వస్తున్న రోగులకు విశేష సేవలను అందిస్తున్నారు. - 8లో



మంటలు ఆర్పబోయి.. రైతు మృతి
కళ్ల ముందే తన పొలంలో మామిడి మొక్కలు అగ్నికి ఆహుతి అవుతుంటే మంటలు అదుపుచేసే ప్రయత్నంలో ఓ రైతు మృతి చెందాడు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 257 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	580	628
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 174.88 కిలోలు

న్యూస్‌రీల్

మార్చి 1 నుంచి 21 వరకు కుష్టువ్యాధిపై ఇంటింటి సర్వే

రాయచోటి అర్బన్ : మార్చి 1 నుంచి 21వతేదీ వరకు కుష్టువ్యాధి నివారణపై ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.కొండయ్య, జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ వ్యాధుల నివారణ అధికారిణి డాక్టర్ శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల్లోని కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లె పట్టణాల్లో ఇంటింటి సర్వేకార్యక్రమం జరుగుతోందన్నారు. కుష్టువ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా నివారించవచ్చన్నారు.

ఈపీఎఫ్‌పై పెన్షన్‌దారులకు అవగాహన



మాట్లాడుతున్న ఈఎస్‌ఐ బ్రాంచ్ మేనేజర్ సోమశేఖర్

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈపీఎఫ్‌పై పెన్షన్‌దారులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజన్, ఈఎస్‌ఐ బ్రాంచ్ మేనేజర్ సోమశేఖర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ సమావేశ హాలులో ఈఎస్‌ఐ నిధి ఆప్ కే నికట్ 2.0పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి మార్చి 3వ తేదీ వరకు ఈఎస్‌ఐ సెలబ్రేషన్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సువిధ సంఘం నిధి ఆప్ కే నికట్ 2.0పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అధికారులు గణపతిరావు, పీవీ చంద్రశేఖర్, సంజీవరెడ్డి, నాగార్జున కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల ఉలవ

- దిగుబడి ఘనం.. ధరలు అమోఘం
- అన్నదాతల ఆనదం
- జిల్లాలో 5250 ఎకరాల్లో పంట సాగు



గుర్రంకొండ మండలంలో చేలల్లో ఉలవ పంటను కోసి కుప్పలుగా పోసిన దృశ్యం

గుర్రంకొండ/వాల్మీకిపురం: జిల్లాలోని పడమటి మండలాల్లో వేరుశనగ పంట సాగు అదును దాటిపోయిన తర్వాత ప్రత్యా మ్నాయ పంటగా ఉలవసాగును ఇక్కడి రైతులు ఎంచుకుంటారు. ఉలవసాగు వల్ల ఈ ఏడాది మంచి లాభాలు వచ్చాయి. సకాలంలో వర్షాలు కురవడంతో ఉలవ పంట ఎకరానికి 3 క్వింటాళ్ల నుంచి 5 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. గత రెండేళ్ల సాధారణ పంట దిగుబడితో పోల్చితే 50 శాతం మేరకు అదనంగా రావడం గమనార్హం. జిల్లాలో ఈ ఏడాది 5,250 ఎకరాల్లో ఉలవ సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో ధర రూ. 57 నుంచి రూ.60 వరకు ధర పలుకుతుండడంతో రైతులు లాభాల బాట పట్టారు.దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంత రైతులు ఆగష్టు నెల నుంచి ఉలవసాగుపై దృష్టిసారిస్తారు. సెప్టెంబర్, అక్టోబర్‌నెలలో సాగు ప్రారంభమవుతుంది. జనవరి, ఫిబ్రవరి నెలల్లో నూర్పిళ్లు ఉంటాయి. దుక్కుల దగ్గర నుంచి ఉలవలు పొలంలో చల్లే వరకు ఒక ఎకరానికి రూ.9వేలు వరకు ఖర్చు వస్తుంది. విత్తనాలు చల్లినప్పటి నుంచి పంట కోత కోసేవరకు ఎలాంటి ఎరువులు, కూలీల ఖర్చు ఉండదు. ఒకేసారి పంట కోత కోయడానికి మ్రాత్రమే కూలీల ఖర్చు వస్తుంది.సాగుప్రారంభమైన తర్వాత రెండు నెలల పాటు సక్రమంగా వర్షాలు కురిస్తే హెక్టారుకు 4 నుంచి5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మార్కెట్లో మంచి ధరలు ఉంటే పెట్టుబడి పోను రైతులకు మంచిలాభాలు వస్తాయి.

రెండేళ్లతో పోలిస్తే మంచి దిగుబడి

జిల్లాలో గత రెండేళ్లలో ఎకరానికి 2 నుంచి 3 క్వింటాళ్ల వరకే పంట దిగుబడి వచ్చింది. ఈ ఏడాది అత్యధికంగా 5 క్వింటాళ్ల దిగుబడి రావడం గమనార్హం. పంట సాగు ప్రారంభమైనప్పటి నుంచి సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలలో రెండు నుంచి నాలుగుమార్లు వర్షాలు కురిశాయి. సెప్టెంబర్ నెలలో పంట సాగు చేసిన రైతులకు గత ఏడాదితో పోల్చితే 35 శాతం అధికంగా పంట చేతికందింది. అక్టోబర్ నెలలో సాగు చేసిన వారికి 50 శాతం మేరకుఅధికంగా పంట దిగుబడి చేతికందింది. ప్రస్తుతం ఉలవ ధరలు మార్కెట్లో కిలో రూ.57 నుంచి రూ.60 వరకు పలుకుతున్నాయి. రెండేళ్లుగా రూ.35 నుంచి రూ.40 వరకే ధరలు పలికాయి. వర్షాలు సక్రమంగా కురవడం, పంట దిగుబడి బాగుండడంతో ఈ ఏడాది ఎకరానికి 3 నుంచి 5 క్వింటాళ్ల మేరకు దిగుబడి వచ్చింది.ఈలెక్కన ఎకరానికి రూ.18వేల నుంచి రూ.30వేలు రైతుకు ఆదాయం వచ్చింది. గత రెండేళ్లుగా ఎకరానికి కేవలం 2.5 క్వింటాళ్ల మేరకే సరాసరి దిగుబడి వచ్చింది. ఈలెక్కన ఎకరానికి రూ.10 వేలు రాబడి వచ్చింది. సాధారణ దిగుబడి రాబడితో పోల్చితే ఈ ఏడాది ఎకరానికి రూ. 20 వేల వరకు అదనపు ఆదాయం రైతుకు సమకూరింది. దీంతో ఈ ఏడాది ఉలవ రైతు లాభాల బాట పట్టాడు.

జిల్లాలో ఉలవ పంట సాధారణ సాగు విస్తీర్ణం:	ఈ ఏడాది సాగైంది:
9,785 ఎకరాలు	5,250
పంట సాగుచేసిన రైతులు: 3,456 మంది	ఎకరాకు వచ్చిన దిగుబడి: 5 క్వింటాళ్లు
ఈ ఏడాది మార్కెట్లో క్వింటా ధర: రూ.6,000	ఎకరా సాగుకు ఖర్చు : రూ.9,000

కష్టానికి ఫలితం దక్కింది



రెండు ఎకరాల్లో ఉలవ సాగు చేశాను. వర్షాలు సకాలంలో కురవడంతో సాగుకు ఖర్చు చేసిన పెట్టుబడి పోను రూ.25లు లాభం వచ్చింది. నాలుగునెలల పాటు పడిన కష్టానికి ఫలితం దక్కంది.గత ఏడాదితో పోల్చితే 50 శాతం దిగుబడి ఎక్కువగా వచ్చింది. రెండేళ్ల నష్టాలు భర్తీ అయ్యాయి. - కేశవ, కొత్తపల్లె

మంచి లాభాలు వచ్చాయి.



ఈ సంవత్సరం ఉలవ ధరలు బాగున్నాయి. కిలో ధర రూ. 55 నుంచి రూ.60 వరకు పలికింది. గత ఏడాదితో పోలిస్తే రెండింతలు పెరిగాయి. మూడు ఎకరాల్లో ఉలవ పంట సాగుచేశాను. మంచి లాభాలు వచ్చాయి. - రెడ్డెప్ప, చెన్నరామపల్లె

స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా
పి.రామసుబ్బారెడ్డి ఏకగ్రీవం

ప్రకటించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ



ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి డిక్లరేషన్ ఫారాన్ని అందుకుంటున్న పి.రామసుబ్బారెడ్డి

కడప సిటీ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వైఎస్సార్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ సాయికాంత్‌వర్మ సోమవారం ఆయనకు సంబంధిత ధ్రువీకరణ (డిక్లరేషన్) పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు కడప నగర మేయర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి హాజరయ్యారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున పి.రామసుబ్బారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ నాయకులు స్వతంత్ర అభ్యర్థిని బరిలోకి దించేందుకు ప్రయత్నాలు చేసి నామినేషన్ వేయించారు. అయితే నామినేషన్ బలపరిచిన వారి సంతకాలు పరిశీలనలో ఫోర్జరీ అని తేలడంతో స్వతంత్ర అభ్యర్థి రమణయ్య నామినేషన్‌ను జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. ఈ నేపథ్యంలో పి.రామసుబ్బారెడ్డి వేసిన ఒకే ఒక్క నామినేషన్ మిగలడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించి డిక్లరేషన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, సోదరుడు గిరిధర్‌రెడ్డితోపాటు జమ్మలమడుగు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

చివరి శ్వాస వరకు జగన్‌తోనే ఉంటా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డైనమిక్ లీడర్. తన తుదిశ్వాస వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ఉంటానని వైఎస్సార్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ఎన్నికల రిటర్నింగ్ అధికారి సాయికాంత్‌వర్మ చేతుల మీదుగా ఎమ్మెల్సీగా డిక్లరేషన్ ఫారాన్ని అందుకున్న తర్వాత కలెక్టరేట్‌లో నగర మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని అందరూ వైఎస్సార్ సీపీ నేతల సహకారం, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తనను బలపరిచినందుకు ఆయన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్టీఆర్ హయాంలో తాను కొడుకుగా తెలుగుదేశం పార్టీలో సేవ చేశానన్నారు. కానీ ఇప్పుడు చంద్రబాబు హయాంలో జిల్లాలో పనిచేస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి, మరికొంతమంది అల్లుళ్లుగా పనిచేస్తున్నారని, ఏమి కష్టపడకుండానే పదవులు అనుభవిస్తున్నారని విమర్శించారు. పార్టీలో ఉండగా ఎన్నో కష్టాలు పడ్డామన్నారు. నిజాయితీగా అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ కూడా ఉన్న పార్టీలో పనిచేస్తానని, ఈ విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో కనీవిని ఎరుగని రీతిలో సామాజిక న్యాయాన్ని పాటిస్తున్నారని, స్థానిక సంస్థల్లో, మంత్రి, కార్పొరేషన్ పదవుల్లో వెనుకబడిన తరగతుల వారిలో రాజకీయ చైతన్యం కల్పించేందుకు పదవులు ఇచ్చారన్నారు. ఈ విషయమై రాజకీయ మేధావులు, విద్యావంతులు దేశ వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైపు చూస్తున్నారన్నారు.

లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డులో
రూ.10.25 లక్షలు హాంఫట్

- మార్కెట్ యార్డులో హస్తలాఘవం ప్రదర్శించిన సెక్రటరీ
- అధికారుల పరిశీలనలో వెలుగు చూసిన స్వాహా పర్వం



చైర్మన్ విశ్వనాథరెడ్డితో మాట్లాడుతున్న జేడీ రామాంజనేయులు, ఏడీఎం కళ్యాణి

లక్కిరెడ్డిపల్లి : కంచే చేను మేసిన చందంగా లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డులో రూ. 10,25,825లు నిధులను స్వాహా చేసిన వైనం సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జేడీ రామాంజనేయులు, ఏడీఎం కళ్యాణిలు చైర్మన్ విశ్వనాథరెడ్డితో కలిసి రికార్డులు పరిశీలించగా మార్కెట్ యార్డులో పనిచేస్తున్న ఓ ఉద్యోగి రూ. 10,25,825లు నిధులు స్వాహా చేసినట్లు తేలింది. గత ఏడాది జూన్‌లో బదిలీపై లక్కిరెడ్డిపల్లికి వచ్చిన కార్యదర్శి రోజువారీగా అన్ని అకౌంట్లు పరిశీలిస్తుండేవారు. ఆయన రాకముందు లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డులో రూ. 6,06,940 ఆఫీసు ఖర్చులకు సంబంధించి నిధులు ఉండేవని, ఈ మొత్తాన్ని ఎవరికీ తెలియకుండా కార్యదర్శి ఒక్కడే రోజు కొద్దికొద్దిగా కాజేశాడని వారు తెలిపారు. ప్రస్తుతం ఆఫీసు యార్డు ఖాతాలో రూ. 11,006లు మాత్రమే ఉన్నట్లు చూపించారు. ఇప్పటికే ఆయన మార్కెట్ యార్డు ఖాతాలో నుంచి రూ. 5,95,934లు నిధులు స్వాహా చేసినట్లు తెలుస్తోందన్నారు. అదే ఆఫీసులో పనిచేస్తున్న మరో ఉద్యోగి రమణమ్మ ఖాతాలో పీఎఫ్ కింద రూ. 7,23,131లు ఉండేదని, ఆమె ఖాతాలో నుంచి రూ. 4,29,891లు కాజేసినట్లు తేలిందన్నారు. మొత్తం రూ. 10,25,825లు నగదును కార్యదర్శి స్వాహా చేసినట్లు రికార్డుల ప్రకారం స్పష్టమైందన్నారు. దీనిపై ఆ ఉద్యోగిని ప్రశ్నిస్తే తిరిగి డబ్బులు చెల్లిస్తానులే అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్లు యార్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే ఆయన రాష్ట్ర కమిషనర్, జేడీ, ఏడీఎంల దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం జేడీ రామాంజనేయులు, ఏడీఎం కళ్యాణీలు లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డుకు చేరుకొని రికార్డులు పరిశీలించారు. కాగా సోమవారం కార్యదర్శి విధులకు హాజరు కాలేదు. రికార్డులు పరిశీలించిన అధికారులు కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ

- ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పక పాటించాలి
- రాజకీయ పార్టీలు సహకరించాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీషా పీఎస్



మాట్లాడుతున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు వివిధ పార్టీల నాయకులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గిరీషా పీఎస్ రాజకీయ పార్టీ నాయకులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై జిల్లా ఎస్పీ హర్షవర్దన్ రాజుతో కలిసి వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 84 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తామన్నారు. మార్చి 13 న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సభలు సమావేశాలు నిర్వహించేందుకు 24 గంటల ముందే పర్మిషన్ తీసుకోవాలన్నారు.

ఎన్నికలలో ఓటు వేసే ఓటర్లు ఓటర్ స్లిప్‌తో పాటు రేషన్ కార్డు, ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాస్ పోర్టు, ఎంప్లాయ్ ఐడీ కార్డు, ఏదైనా ఒక గుర్తింపు కార్డుతో వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. మార్చి 9వ తేదీ నాటికల్లా ఓటర్లకు ఓటర్ స్లిప్ ఇస్తామన్నారు.

ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి : జిల్లా ఎస్పీ హర్షవర్దన్ రాజు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని జిల్లా ఎస్పీ హర్షవర్దన్ రాజు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రాజకీయ ప్రకటనల ద్వారా కుల, మతపరమైన అభ్యర్థనలు చేయకూడదన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మార్చి 5లోగా ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు స్లిప్పుల పంపిణీ

మార్చి 5లోగా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని, వలంటీర్లను ఎన్నికల ప్రక్రియకు ఉపయోగించకూడదని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, స్పందన, గ్రామ,వార్డు సచివాలయాలు, గృహనిర్మాణం, రీసర్వే మొదలైన అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు స్లిప్పుల పంపిణీ, 100 శాతం పంపిణీ, అన్ని పోలింగ్ కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు, పోలింగ్ అధికారులకు శిక్షణ వంటి అంశాలపై కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి, మదనపల్లె ఆర్డీఓలు రంగస్వామి, మురళి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీబీ పేషెంట్లకు అండగా నిలుద్దాం

రాయచోటి : జిల్లాలోని టీబీ పేషెంట్లను మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి దత్తత తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో టీబీ పేషెంట్ల దత్తతపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. పేద క్షయ రోగులకు పౌష్టికాహారం అందించేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తాను ముగ్గురు టీబీ పేషెంట్లను దత్తత తీసుకున్నానని చెప్పారు. అలాగే జాయింట్ కలెక్టర్ ఇద్దరు పేషెంట్లను దత్తత తీసుకున్నారన్నారు. అందులో భాగంగా డీఎంహెచ్‌ఓకు కలెక్టర్ ముగ్గురు టీబీ పేషెంట్ల దత్తతపై చెక్కును కూడా అందజేశారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

సామాన్య ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని అధికారులను అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్‌తో పాటు జేసీ తమీమ్‌అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మలు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే ఉద్దేశంతో స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.

స్వాముల భూములు స్వాహా..!

- జిల్లాలో ఆక్రమణలో 2,504.3 ఎకరాలు
- రైల్వేకోడూరులో అత్యధికంగా 513 ఎకరాలు
- ట్రిబ్యునల్‌లో కేసులు దాఖలుకు నివేదికలు సిద్ధం
- కొత్తగా వెలుగులోకి వచ్చిన 799 ఎకరాల భూమి
- రీసర్వే విస్తీర్ణంపై అప్పీళ్లు

స్వామీ.. నీవే దిక్కు అని మొక్కుకునే దేవుడికే కొందరు శఠగోపం పెడుతున్నారు. అందినకాడికి ఆలయాల పేరిట ఉన్న భూముల్ని స్వాహా చేస్తున్నారు. పుణ్య క్షేత్రాల జిల్లాగా పేరొందిన అన్నమయ్య జిల్లాలో ఆలయాల భూముల ఆక్రమణకు గురైనట్లు సాక్షాత్తూ అధికారుల సర్వేలోనే బహిర్గతమైంది.



ఓబులవారిపల్లె మండలం వై.కోటలో ఆక్రమణలోని ఆలయ భూమి

బి.కొత్తకోట : దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల భూములు ఆక్రమణకు గురైనట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టిన నేపథ్యంలో ఆలయాల భూములను ఆక్రమించుకుని అనుభవిస్తున్నట్లు బహిర్గతమైంది. ఆలయాల భూములను సంరక్షించి వాటి వివరాలు రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయించడం కోసం జిల్లా దేవదాయశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ వివరాల సేకరణలో పడిన అధికారులు జిల్లాలో ఆక్రమణలకు గురైన భూముల వివరాలు తెలుసుకుని నోరెళ్లబెడుతున్నారు. ఊహించని స్థాయిలో ఆలయాల భూములు ఆక్రమణకు గురైనట్లు గుర్తించి వాటిపై చర్యలకు సిద్ధమవుతున్నారు. దేవదాయశాఖ ట్రిబ్యునల్‌లో కేసులు దాఖలు చేసి ఆక్రమణదారుల చెర నుంచి విడిపించేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

ఆక్రమణలో కోడూరు టాప్

జిల్లాలో 30 మండలాలు ఉండగా అందులో గుర్రంకొండ, చిట్వేలి మినహా మిగిలిన 28 మండలాల్లో ఆలయాల మాన్యం భూములు ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణలో ఉన్నాయి. అధికారిక లెక్కల ప్రకారం ఒక్క రైల్వేకోడూరు మండలంలో 513.44 ఎకరాల భూములు ఆక్రమణలో ఉన్నాయి. మొత్తం 2,504.3 ఎకరాలు ఆయా మండలాల్లోని ఆక్రమణదారుల చేతుల్లో ఉన్నట్టు నిర్ధారించి వాటి వివరాలను సేకరించడం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆక్రమణ భూముల గూగుల్ మ్యాప్ వివరాలను ప్రభుత్వానికి నివేదించారు. ఈ భూములను ఆక్రమణదారుల నుంచి విడిపించేందుకు చర్యలు చేపట్టారు. భూముల వివరాలతో దేవదాయశాఖ ట్రిబ్యునల్‌లో కేసులు దాఖలు చేయనున్నారు.


కొత్తగా వెలుగులోకి 799 ఎకరాలు

రికార్డుల్లో లేని దేవదాయశాఖకు చెందిన భూములు కొత్తగా వెలుగులోకి వస్తున్నాయి. 16 మండలాల్లో 799.35 ఎకరాలు గుర్తించారు. వీటిలో అధికంగా గాలివీడు మండలంలో 182.79 ఎకరాలు, పుల్లంపేటలో 144.87 ఎకరాలు, టి.సుండుపల్లెలో 71.51 ఎకరాలు, రాయచోటిలో 53.16 ఎకరాలు, సంబేపల్లెలో 42.40 ఎకరాలు, చిన్నమండెంలో 24.54 ఎకరాలు, రామాపురంలో 58.04 ఎకరాలు, వీరబల్లిలో 26.99 ఎకరాలు, లక్కిరెడ్డిపల్లెలో 36.66 ఎకరాలు, రైల్వేకోడూరులో 19.01 ఎకరాలు, నందలూరులో 39.07 ఎకరాలు, ఓబులవారిపల్లెలో 60.07 ఎకరాలు, రాజంపేటలో 35.66 ఎకరాలు, పెనగలూరులో 0.11 ఎకరాలను కొత్తగా గుర్తించారు.

జిల్లాలో దేవదాయ భూముల వివరాలు

మొత్తం ఆలయాలు	:1,316
భూములు	:8,281 ఎకరాలు
రెవెన్యూ రికార్డుల్లో నమోదైంది :	7,353.6 ఎకరాలు
పట్టణాల్లో ఉన్నవి	:28.57 ఎకరాలు
గ్రామాల్లో ఉన్నవి	:8,252.4 ఎకరాలు
అర్చకుల అనుభవంలో ఉన్నవి	:1,919 ఎకరాలు
ఆక్రమణల్లో ఉన్నవి	:2,504.3 ఎకరాలు
లీజుకు ఇచ్చినవి	:1,137 ఎకరాలు
లీజు ఆదాయం	:రూ.33.32 లక్షలు
ఇతర జిల్లాల్లో ఉన్నభూమి	:45.38 ఎకరాలు
ఖాళీభూమి	:2,684 ఎకరాలు

రీసర్వేపై అప్పీళ్లు



జిల్లాలో రీసర్వే సాగుతున్న మండలాల్లోని గ్రామాల్లో ఆలయాల భూముల వాస్తవ విస్తీర్ణం కంటే..తక్కువ విస్తీర్ణం కనబరచిన వాటిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో తహసీల్దార్ల వద్ద అప్పీళ్లను దాఖలు చేసేందుకు జిల్లా అధికారులు నిర్ణయించారు. దీనిపై ఆయా మండలాల దేవదాయశాఖ అధికారులు 50కిపైగా అప్పీళ్లను సిద్ధం చేశారు. వీటిని తహసీల్దార్లకు అందించనున్నారు.

ట్రిబ్యునల్‌లో కేసులు వేస్తున్నాం



జిల్లాలో ఆలయాల భూములను ఆక్రమించుకున్న వారిపై దేవదాయశాఖ తరపున ట్రిబ్యునల్‌లో కేసులు వేస్తున్నాం. ఆక్రమణలకు గురైన భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించాం. వీటి సమగ్ర వివరాలతో నివేదికలు సిద్ధం చేసి తదుపరి చర్యలకు ప్రభుత్వానికి నివేదించాం. ఆలయాల భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. అవసరమైతే క్రిమినల్ చర్యలు ఉంటాయి. సర్వేలో తగ్గిన భూ విస్తీర్ణం పైనా అప్పీళ్లు వేస్తున్నాం.
- సి.విశ్వనాథ్, దేవదాయశాఖ జిల్లా అధికారి

జిల్లాలో ఆక్రమణలోని భూములు

మండలం	ఎకరాలు	మండలం	ఎకరాలు	మండలం	ఎకరాలు
				గాలివీడు	168.12
				రామాపురం	100.68
బి.కొత్తకోట	18.3	పెద్దతిప్పసముద్రం	127.86	టి.సుండుపల్లె	122.49
కేవీపల్లె	90.35	పెద్దమండ్యం	19.16	వీరబల్లి	81.23
కలకడ	59.86	పీలేరు	61.67	లక్కిరెడ్డిపల్లె	119.37
కలికిరి	9.92	రామసముద్రం	16.93	రైల్వేకోడూరు	513.44
కురబలకోట	16.76	తంబళ్లపల్లె	128.53	నందలూరు	5.28
మదనపల్లె	39.03	వాయల్పాడు	40.0	ఓబులవారిపల్లె	106.74
ములకలచెరువు	64.29	రాయచోటి	94.81	పుల్లంపేట	60.72
నిమ్మనపల్లె	7.89	సంబేపల్లె	105.13	రాజంపేట	72.5
		చిన్నమండెం	81.44	పెనగలూరు	171.91

రిమ్స్‌లో కార్పొరేట్ వైద్యం

- జిల్లా ప్రజలకు విశేష వైద్య సేవలు
- ఎక్స్‌రే, స్కానింగ్, ఎంఆర్‌ఐ, సీటి స్కాన్ పరీక్షల నిర్వహణ



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రధాన ద్వారం



రిమ్స్‌లో ఓపి విభాగం భవనం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్యసేవలు విస్తృతమయ్యాయి. ఇక్కడికి వస్తున్న రోగులకు విశేష సేవలను అందిస్తున్నారు. ఓపీకి రోజూ 1800 మంది నుంచి 2000 మందిదాకా వస్తుంటారు. గతంలో ఎక్స్‌రే, సీటి స్కాన్, స్కానింగ్, ఎంఆర్‌ఐ పరీక్షలను చేయించుకునేందుకు ప్రైవేటు వారిని సంప్రదించాల్సి వచ్చేది. ప్రస్తుతం అలాంటివేమీ లేకుండానే వైద్య సేవలను ప్రాధాన్యత ఉన్న విభాగాల్లో పొందుతున్నారు. గైనిక్, ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, చిన్నపిల్లల విభాగం, ఎస్ఎన్‌సీయూ, అప్తాలమిక్, చర్మవ్యాధుల నివారణ, మానసిక వ్యాధుల నివారణ, ఫిజియోథెరఫీ, డయాలసిస్‌తో పాటు ఇతర విభాగాల్లో వైద్య పరీక్షలను ఓపి, ఐపీ విభాగాల్లో నిర్వహిస్తున్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను అందిస్తున్నారు.

■ ఐపీ విభాగంలో అత్యవసర పరిస్థితుల్లో క్యాజువాలిటీకి 24/7 పద్ధతిలో వైద్య సేవలను పొందే అవకాశం ఉంది. ఈ విభాగంలోనే అవసరమైన సమయంలో మొబైల్ ఎక్స్‌రేలను కూడా తీస్తున్నారు. కాన్పుల కోసం వచ్చేవారు నేరుగా కాన్పుల విభాగం (లేబర్ వార్డు)లో చేర్పించేందుకు అవకాశం ఉంది. ఐపీ విభాగంలో 750 నుంచి 1000 మంది దాకా వైద్య సేవలు పొందుతున్నారు. ప్రధానంగా కాన్పుల విభాగం, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్ తదితర విభాగాల్లో ఎక్కువ మంది అడ్మిట్ అవుతున్నారు. ఉపశమనం పొంది డిశ్చార్జ్ అవుతున్నారు.

■ సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓలు డాక్టర్ గీత, డాక్టర్ సునీత, డాక్టర్ రాజేశ్వరిలు, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, అన్ని విభాగా హెచ్ఓడిలు, వైద్య సిబ్బందితో కలిసి నిరంతరం రోగుల కష్టనష్టాలను పర్యవేక్షిస్తున్నారు.


■ ఇటీవలి కాలంలో రిమ్స్‌కు వచ్చే ప్రతి రోగికి సంబంధించిన వివరాలను వారి ఆధార్‌కార్డుతో పాటు లింక్ చేసి, ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ పద్ధతి ద్వారా ఓపీ , ఆధార్ కార్డు నెంబర్‌ను నమోదు చేసుకుంటే ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికపుడు, ఎక్కడి నుంచైనా పరిశీలించి వైద్య సేవలను అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

■ ఓ.పి విభాగంలో వివిధ విభాగాలకు చెందిన వైద్య పరీక్షలను చేయించుకునేందుకు మొదట ఓ పీ.చీటీని తీసుకోవాలి. తరువాత వారు సూచించిన మేరకు ఆయా విభాగాలకు వెళ్లి వైద్యులచేత పరీక్షలను చేయించుకోవాల్సి ఉంటుంది. రోజూ 1800 నుంచి 2000 మందిదాకా రిమ్స్‌కు వచ్చి ఓపి వైద్యసేవలను పొందుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆ తరువాత అవసరమైన వారికి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నారు.

■ రోగులకు ఎప్పటికపుడు వైద్య సేవలతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. నెలసరిగా వాడే మందులను కూడా అవసరమైన వారికి అందజేస్తున్నారు. ప్రధానంగా డయాబెటిక్ (షుగర్ సంబంధిత వ్యాధి), మానసిక సంబంధిత వ్యాధులకు సంబంధించి అవసరమైన మందులను ఇస్తున్నారు.

■ పుట్టిన వారికి జనన ధ్రువీకరణ, మరణించిన వారికి మరణ ధ్రువీకరణ పత్రాలను తగిన ఆధారాలతో వస్తే ఎప్పటికపుడు జారీ చేస్తున్నారు.

■ దివ్యాంగులకు సంబంధించిన సర్టిఫికెట్లు జారీ కూడా ఓపీ, ఐపీ విభాగాల్లో వైద్య పరీక్షలు చేసి అర్హత కలిగిన వారికి, వారికి కేటాయించిన తేదీలలో ప్రధానంగా మంగళ, శుక్రవారాల్లో జారీ చేస్తారు. వీరు అంతకుముందు తమ పరిధిలోని సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని, కేటాయించిన తేదీల్లో, నిర్ణయించిన ఆసుపత్రుల్లో నేరుగా హాజరు కావాల్సి వుంటుంది. ఇంకా రిమ్స్ ఆవరణలోనే క్యాన్సర్, మానసిక వైద్యం, సూపర్ స్పెషాలిటీ సేవలను జిల్లా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి జరుగుతోంది.



రిమ్స్‌లో ఎంఆర్‌ఐ యంత్రం ద్వారా పరీక్షలు

2022 జనవరి నుంచి డిసెంబర్ దాకా వివిధ విభాగాల్లో ఓపీ, ఐపీ ద్వారా వైద్య సేవలు పొందిన వారి వివరాలు..		
వైద్య విభాగం	ఓపీ సేవలు	ఐపీ సేవలు
గైనకాలజీ (కాన్పులు, మహిళల వ్యాధులు)	36,684	663
కాన్పుల విభాగం	--	8569
ఆర్థోపెడిక్	40, 290	1782
కాలిన గాయాలు	--	52
కార్డియాలజీ	--	133
డెంటల్	1161	127
ఈ.ఎన్.టీ	16798	599
ఈఎన్‌టీ (అత్యవసరకేసులు)	--	750
జనరల్ మెడిసిన్	64357	4218
జనరల్ సర్జరీ	21684	3850
చిన్నపిల్లల విభాగం	20377	4809
ఎన్.ఎన్.సీ.యు	--	3868
ఆప్తమాలజీ	16443	1695
లెప్రసీ	129	05
మానసిక వ్యాధుల నివారణ	13587	303
పల్మనరీ మెడిసిన్	3427	578
చర్మవ్యాధుల నివారణ (స్కిన్)	19196	303
ఎంఐసీయు	-	8477
డయాలసిస్	-	7156

ప్రతి ఒక్కరికీ వైద్య సేవలందేలా కృషి



కడపలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కు వచ్చే ప్రతి రోగికి అవసరమైన వైద్య సేవలను అందించేందుకు అందరి సహకారంతో కృషి చేస్తున్నాం. ఓపీ, ఐపీ విభాగాల సేవలను అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. ప్రతి రోగికి సంబంధించిన వివరాలను నమోదు చేస్తున్నాం. తద్వారా ఎక్కడైనా, ఎప్పుడైనా వారి వివరాలను ఆన్‌లైన్‌లో చూసుకుని వైద్య సేవలను, మందులను అందించేందుకు వీలుపడుతుంది. ఏదైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, అడిషనల్ డీఎంఈ, సూపరింటెండెంట్, ప్రభుత్వసర్వజన ఆసుపత్రి (రిమ్స్), కడప

క్లుప్తంగా

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామికి అర్చన, పంచామృతాభిషేకం, తోమాలసేవ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కళ్యాణ మండపంలో కళ్యాణానికి ముస్తాబైన సుబ్రహ్మణ్యస్వామి, వల్లిదేవసేనకు రక్షాబంధనం, బాసింగ ధారణ, మంగళ్యధారణ, తలంబ్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కూరగాయల దుకాణంలో రూ.లక్ష మాయం

ఒంటిమిట్ట : మండల కేంద్రంమైన ఒంటిమిట్టలో జాతీయ రహదారి పక్కన ఉన్న ప్లాట్‌ఫాంపై గల బాలయ్య అనే వ్యక్తి కూరగాయల దుకాణంలో సోమవారం రూ. లక్ష మాయమైనట్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుల కథనం మేరకు.. బాలయ్య కడపకు చెందిన కొంత మంది దగ్గర ఫైనాన్స్ తీసుకునేవాడు. ఎప్పటి లాగే సోమవారం కూడా కడప కు చెందిన ఫైనాన్స్ వారు వచ్చి రూ. 1 లక్ష ఇచ్చి వెళ్లారు. అది తీసుకొని ఇంటికి వెళ్లాలని బయలుదేరాడు. ఈలోగా కూరగాయల కోసం జనాలు రావడంతో డబ్బులు టమోటాల ట్రేలో ఉంచాడు. కూరగాయలు విక్రయించిన అనంతరం టమాట ట్రేలో చూస్తే డబ్బులు కనిపించలేదు.వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్ఐని వివరణ కోరగా తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి, కేసు నమోదు చేస్తామని తెలిపారు.

పాఠశాల రికార్డుల తనిఖీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ నారాయణ సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, హాజరు నమోదు, మౌలిక వసతులపై ఆరా తీశారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆయన పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు.

తల్లిపై కూతురు, అల్లుడు దాడి

మదనపల్లె : ఆస్తి వివాదాల్లో భాగంగా తల్లిపై కూతురు, అల్లుడు దాడికి పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో సోమవారం జరిగింది. మండలంలోని తట్టివారిపల్లె పంచాయతీ పుంగనూరువాండ్లపల్లెకు చెందిన రమణమ్మ(50) కూలిపనులు చేసుకుంటూ జీవిస్తోంది. ఈక్రమంలో కొద్దిరోజుల క్రితం తన కుమార్తె లావణ్యకు ఇంటి స్థలం దానంగా రాసిఇచ్చింది. అయితే ఆ స్థలంతో పాటు రమణమ్మకు ఉన్న మరో స్థలాన్ని కుమార్తె లావణ్య భర్తతో కలిసి ఫోర్జరీ సంతకాలతో డాక్యుమెంట్ తయారుచేసింది. ఈ విషయం తెలుసుకున్న రమణమ్మ సోమవారం కుమార్తె లావణ్య, అల్లుడిని నిలదీసింది. దీంతో వారి మధ్య గొడవ జరిగింది. ఆవేశానికి గురైన లావణ్య, ఆమె భర్త బాధితురాలు రమణమ్మపై దాడిచేశారు. దాడిలో గాయపడిన రమణమ్మను స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సెల్‌ఫోన్ చోరీ

మదనపల్లె : ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగి వెంట ఉండేందుకు వచ్చిన వ్యక్తి స్మార్ట్‌ఫోన్ చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన మేరకు వివరాలు.. ములకలచెరువు మండలం వేపూరికోటకు చెందిన బి.శంకరరెడ్డి తన తల్లి పాపులమ్మ బీపీ, షుగర్ సమస్యలతో బాధపడుతుండగా ఆదివారం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చాడు. ఉదయం నుంచి తల్లికి తోడుగా ఆమె కుమార్తె కళావతి ఉండగా రాత్రి సమయంలో కుమారుడు శంకర్‌రెడ్డి ఉన్నాడు. రాత్రి బెడ్‌పైన తన స్మార్ట్‌ఫోన్ ఉంచి నిద్రించాడు. ఉదయం లేచి చూసేసరికి సెల్‌ఫోన్ కనిపించకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఫోన్ విలువ సుమారుగా రూ.15వేలకు పైగానే ఉంటుందని బాధితుడు తెలిపాడు. చోరీ విషయమై ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా

ములకలచెరువు : కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి బోల్తా కొట్టడంతో డ్రైవర్‌కి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. స్థానికంగా జరుగుతున్న రోడ్డు పనుల కోసం కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి బురకాయలకోట సమీపంలో బోల్తాకొట్టింది. ప్రమాదంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ ప్రదీప్‌కుమార్(37) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు డ్రైవర్‌ను 108 సహాయంతో చికిత్స కోసం మదనపల్లి ప్రభుత్వ జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. జేసీబీ సహాయంతో టిప్పర్‌ను రోడ్డుకు అడ్డులేకుండా పక్కకు జరిపి ట్రాఫిక్‌ను నియంత్రించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భాస్కర్‌నాయక్ చెప్పారు.

ఇరువర్గాల దాడి - ముగ్గురిపై కేసు

కలకడ : ఇరువర్గాల దాడిలో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీ యల్లంకివారిపల్లె హరిజనవాడకు చెందిన వంగిమళ్ళ రెడ్డెప్ప కుమారుడు రమేష్‌ను అదే గ్రామానికి చెందిన మల్లికార్జున, అతని తమ్ముడు వెంకటేశ్వర్లు కర్రలతో కొట్టి గాయపరిచినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. అలాగే అదే గ్రామానికి చెందిన మల్లికార్జున భార్య శోభారాణిని రమేష్ దుర్భాషలాడినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమేష్‌పై కేసు నమోదు చేశారు. రెండు వర్గాలకు చెందిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శోకసంద్రమైన తిరుమలయ్యగారిపల్లె



కొడుకు మృతదేహం వద్ద స్పృహ తప్పి కుప్పకూలిన తల్లి సుశీలమ్మ



విషణ్ణవదనంలో స్నేహితులు

కొడుకు మృతిని తట్టుకోలేకస్పృహ కోల్పోయిన తల్లిదండ్రులు

రాజంపేట టౌన్ : ఉన్న ఒక్కగానొక్క కొడుకును బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలనుకున్నారు. బతుకుదెరువు కోసం పల్లెటూరి నుంచి రాజంపేట పట్టణానికి వచ్చిన ఆవుల రమణయ్య, సుశీల దంపతుల ఆశలను రోడ్డుప్రమాదం చిదిమేసింది. చిత్తూరు జిల్లా కుప్పం–పలమనేరు రహదారిలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రమణయ్య, సుశీల దంపతుల ఏకైక కుమారుడు కళ్యాణ్‌యాదవ్ మృతి చెందడంతో వారి ఆశలు, కలలు గాలిలో కలిసిపోయాయి. కళ్యాణ్ అంత్యక్రియలను సోమవారం వారి స్వగ్రామమైన పుల్లంపేట మండలం తిరుమలయ్యగారిపల్లెలో నిర్వహించారు. ఇదిలావుంటే రమణయ్య జీవితం సినిమా కష్టాల్లా ఉండేది. అలాంటి పరిస్థితుల్లో మానసిక వికలాంగురాలైన తమ కుమార్తెకు ఏదో ఒక ఆదరవు చూపాలని, కుమారుడిని బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలన్న సంకల్పంతో రమణయ్య ఎల్ఐసీ ఏజెంటుగా జీవితాన్ని ప్రారంభించాడు. తన ఒక్కడి సంపాదనతో బిడ్డలకు మంచి భవిష్యత్తు ఇవ్వలేమని తన భార్యను రాజంపేట మున్సిపల్ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగంలో కుదిర్చాడు. ఇద్దరి సంపాదన వల్ల ఆర్థికంగా నిలదొక్కుకుంటూ వస్తుండటం, మరోవైపు కుమారుడు చదువులో రాణిస్తూ మదనపల్లెలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సీటు సాధించి ద్వితీయ సంవత్సరం చదువుతుండటం.. ఇలా వారి జీవితం సంతోషంగా సాగిపోతూ వచ్చేది. ఇలాంటి తరుణంలో కన్నబిడ్డను రోడ్డు ప్రమాదం పొట్టన పెట్టుకోవడంతో తల్లిదండ్రులు ఆ బాధ భరించలేక పోయారు. కుప్పం ఏరియా ఆసుపత్రిలో తన బిడ్డను విగతజీవుడిగా చూసినప్పటి నుంచి తిరుమలయ్యగారిపల్లెలో అంత్యక్రియలు ముగిసే వరకు అనేక మార్లు స్పృహ తప్పారు. తల్లిదండ్రులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. ఇక ఈ జీవితం మాకెందుకు అంటూ కుమారుడి మృతదేహంపై పడి విలపించడం అక్కడి ఉన్న వారి హృదయాలను కలచివేసింది.గ్రామ ప్రజలంతా శోకసంద్రంలో మునిగిపోయారు.

కడచూపు కోసం తరలి వచ్చిన స్నేహితులు

కళాశాలలో సరదాగా గడిపిన తోటి మిత్రుడు కళ్యాణ్‌యాదవ్ మృతిని స్నేహితులు జీర్ణించుకోలేక పోయారు. మదనపల్లెలోని తోటి స్నేహితులే కాక, పాఠశాల, ఇంటర్మీడియట్‌లో కలిసి చదువుకొని వివిధ ప్రాంతాల్లో ఉంటున్న అనేక మంది మిత్రులు సైతం కళ్యాణ్ యాదవ్‌ను కడసారిగా చూసేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. స్నేహితుడి మృతదేహం చూడగానే కన్నీటిపర్యంతమయ్యారు.

మంటలు ఆర్పబోయి..రైతు మృతి





సహదేవయ్య మృతదేహం, అగ్నికి ఆహుతైన మామిడి చెట్లు

పీలేరు : కళ్ల ముందే తన పొలంలో మామిడి మొక్క లు అగ్నికి ఆహుతి అవుతుంటే.. పంటను కాపాడుకోవాలనే తాపత్రయంతో మంటలు అదుపుచేసే ప్రయత్నంలో రైతు మృతి చెందిన విషాద సంఘటన మండలంలోని మేళ్లచెరువు పంచాయతీ హరిజనవాడలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మేళ్లచెరువు హరిజనవాడకు చెందిన సహదేవయ్య (60)కు గ్రామ సమీపంలో మూడెకరాల్లో సుమారు ఐదు సంవత్సరాలు వయస్సు మామిడి చెట్లు ఉన్నాయి. రెండు రోజులుగా సమీప అడవుల్లో మంటలు అంటుకుంటూ వచ్చాయి. ఈ క్రమంలో సోమవారం సహదేవయ్యకు చెందిన మామిడితోటకు మంటలు వ్యాపించాయి. దీంతో గ్రామస్తులతో కలసి మంటలు అదుపుచేసి తన పంటను కాపాడుకోవాలని తాపత్రయంతో నీరు చల్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఊపిరి ఆడక సహదేవయ్య కిందపడిపోయారు. గమనించిన గ్రామస్తులు ఆయన్ను కాపాడేందుకు నీరు తాపించారు. అయితే అప్పటికే మృతి చెందాడు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన ప్రవీణ్(23) భవన నిర్మాణ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఆర్థిక సమస్యల కారణంగా మనస్తాపం చెంది నిద్రమాత్రలు మింగాడు. ఇదే ప్రాంతానికి చెందిన మంజునాథ్ భార్య పుష్పలత(20) చేనేత కార్మికురాలిగా పనిచేస్తోంది. ఇటీవల ఆమె కడుపునొప్పితో అనారోగ్యం బారిన పడింది. పలుచోట్ల చికిత్సలు చేయించినా ఫలితం లేకపోగా సోమవారం మరోసారి కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేక మనస్తాపం చెంది పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పొలానికి నిప్పు



పొలంలో మంటలు అదుపు చేస్తున్న ఫైర్ అధికారులు

రాజంపేట రూరల్ : ఆకతాయిల సరదా ఓ రైతు కుటుంబానికి శాపంగా మారింది. మండల పరిధిలోని గుండ్లూరు పంచాయితీలో గల పద్మాచంద్ర భవాని నగర్‌లోని పొలంలో మంటలు చెలరేగి సోమవారం డ్రిప్ పైపులు కాలిపోయాయి. పసుపు పంట అగ్నికి ఆహుతైంది. సర్వే నెంబరు 276లో 5 ఎకరాల పొలాన్ని రామాంజనేయులు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటున్నాడు.ఆకతాయిలు పొలానికి నిప్పుపెట్టడంతో రూ.3లక్షల మేర నష్టం వాటిల్లిందని రామాంజనేయులు వాపోతున్నాడు. ఫైర్ శాఖ అధికారులు ఆలస్యంగా వచ్చి మంటలు అదుపు చేశారని, సకాలంలో స్పందించి ఉంటే నష్టం తగ్గేదని రైతులు అంటున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం : మండలంలో ఐదుగురు జూదరులను సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి. వెంకటేష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బండమీదపల్లె పంచాయతీ తురకపల్లెకు సమీపంలో జూదం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. జూదరుల నుంచి రూ.9400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. ఎక్కడైనా జూదం, నాటుసారా తయారీ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

లారీలు ఢీ: ఇద్దరికి గాయాలు

రామాపురం: రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో సోమవారం రెండు లారీలు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ కొండారెడ్డి కథనం మేరకు వివరాలు రాయచోటి నుండి కడప వెళ్తున్న (టీఎస్ 23 సీఎల్ 0037) జిప్సం లారీని వెనుకవైపు నుంచి వేరుశనగ లోడుతో వెళుతున్న లారీ (ఏపీ03టీఈ9636) ఢీ కొంది. లారీ డ్రైవర్ సురేష్‌కు రెండు కాళ్లు విరిగాయి. క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకుని క్షతగాత్రులను 108లో కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.